ఎండలు తీవ్రం.. జాగ్రత్తలు అవసరం

మేత మేయడానికి ఎండలో వెళ్తున్న మేకలు, గొర్రెలు, ఆవులు

నిర్మల్ టౌన్, మార్చి 30: జిల్లాలో ఎండలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రంలోనే నిర్మల్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే జిల్లాలో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరగడంతో ఇటు పశువులు, మూగ జీవాలు, అటు జనం అల్లాడి పోతున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ వేడి భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకొంటున్నా జీవరాసులకు మాత్రం ఈ ఎండలు దడ పుట్టిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటి పోతున్న నేపథ్యంలో పశుగ్రాసం కోసం పశు పోషణ దారులు సుదూర ప్రాంతాలకు పశువులను తీసుకెళ్తున్నారు. పరిసర ప్రాంతాల్లో గడ్డి లేకపోవడంతో గుట్టలు, చెరువులు, ప్రాజెక్టు శిఖం భూముల్లో ఉన్న పశుగ్రాసాన్ని ఉపయోగించుకొంటున్నారు. జిల్లాలో 3 లక్షలకు పైగా పశువులు ఉన్నాయని అధికారులు తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను మేత మేపడానికి ఉదయం 7 గంటలకే బయటకు తీసుకెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి నీడ పట్టున చేర్చాలి. తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మేత మేపాలి. ఎండ బారినుంచి కాపాడేందుకు చెట్లకింద షెడ్డును ఏర్పాటు చేయాలి. పశువులకు రోజుకు రెండుసార్లు నీళ్లు తాగించాలి. తోటలు ఉన్నవారు పశుగ్రాసం పెంచాలి. ఈనిన పశువులకు పాలు తక్కువగా పిండాలి. దూడలకు పాలు ఎక్కువగా తాగించాలి. అనారోగ్యం ఏర్పడితే వెంటనే పశువైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలి. గ్రామల్లో నీటి తొట్టెలు నీళ్లతో నింపుకోవాలి.

–గంగాధరయ్య, జిల్లా పశువైద్యాధికారి

పశుగ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులు, జీవాలు

నిర్మల్, సారంగపూర్, లక్ష్మణచాంద, కుంటాల, దిలావర్‌పూర్, లోకేశ్వరం, ముధోల్, కడెం, ఖానాపూర్, సోన్ మండలాల్లో గోదావరి, స్వర, కడెం ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో పశుగ్రాసంపై పశుపోషణ దారులు ఆధారపడుతున్నారు. ప్రతిరోజూ అక్కడికి పశువులను తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి చేరుస్తున్నారు.

ఎండలకు అల్లాడుతున్న పశువులు

జిల్లాలో మూడు రోజుల నుంచి రికార్డు స్థాయిలో ఎండలు నమోదు కావడంతో మూగ జీవాలు ఎండ వేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్నాయి. మేత మేపడానికి పోషణ దారులు 10 గంటలకు బయటకు తీసుకెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుస్తున్నారు. జీవాలు పొద్దంతా ఎండలోనే ఉండడంతో విలవిల్లాడుతున్నాయి. పశువుల్లో ఎదుగుదల, పాల ఉత్పత్తిపై కూడ ఈ ప్రభావం పడుతుందని రైతులు తెలిపారు. పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్న కుంటుంబాలు ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయి.

పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది

జిల్లాలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. ఎండ వేడిమి కారణంగా పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. భూగర్భజలాలు తగ్గడం, నీటి వనరుల్లో నీళ్లు లేకపోవడంతో పశువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎండ కారణంగా పశువులు మేత లేక బక్కచిక్కి పోతున్నాయి. ఉదయం, సాయంత్రం పూటనే పశువులను బయటకు తీసుకెళ్లడం ద్వారా ఆహారం సరిపోక అనారోగ్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వం అడవుల్లో పశుగ్రాసానికి ప్రత్యేక స్థలాలు కేటాయించాలి.

–ఫారూఖ్, రైతు

సబ్ మార్కెట్ యార్డు కల నెరవేరేనా!

- ఇబ్బందుల్లో అన్నదాత
- పట్టించుకోని పాలకులు

మార్కెట్ యార్డు నిర్మాణం కోసం పరిశీలించిన స్థలం

ముధోల్, మార్చి 30 : నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో సబ్ మార్కెట్ యార్డు కలగానే మిగిలింది. మార్కెట్‌యార్డు నిర్మాణం కోసం పాత గురుకుల పాఠశాల స్థలాన్ని గత పాలకులు, మార్కెటింగ్ అధికారులు పరిశీలించి వెళ్లారు. పక్కనే ఉన్న వ్యవసాయ భూమిని ఇవ్వడానికి రైతులు కూడా అంగీకరించారు. అయినప్పటికీ సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు కాలేదు. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఆరుగాలం పండించిన పంటలను అమ్ముకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. భైంసా, మహారాష్ట్రలోని ధర్మాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లి పంటలను అమ్ముకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామన్న నాయకుల మాటలు నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. గత సంవత్సరం సబ్ మార్కెట్ యార్డు స్థలం కోసం మార్కెట్ శాఖ అధికారులు తహసీల్దార్‌తో చర్చించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ముధోల్‌లో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే ముధోల్‌తో పాటు బాసర, తానూర్, లోకేశ్వరం తదితర మండలాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి రైతులకు బాసటగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

సబ్ మార్కెట్ యార్డు లేక ఇబ్బందులు

మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తున్నది. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. సబ్ మార్కెట్ యార్డు ఉంటే మద్దతు ధర లభిస్తుంది, రైతుకు న్యాయం జరుగుతుంది. అధికారులు, నాయకులు పట్టించుకుని మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి.

–మోహన్, రైతు, ముధోల్

తక్షణమే నిర్మించాలి

ముధోల్‌లో మార్కెట్ యార్డును తక్షణమే ఏర్పాటు చేయాలి. మార్కెట్ యార్డు లేక రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోతున్నారు. దూర ప్రాంతాలకు తరలించాలంటే వ్యయం ఎక్కువవుతుంది. దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల కష్టాలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్కెట్ యార్డు నిర్మాణంలో చొరవ చూపాలి.

–రవి, రైతు, చించాల

ఏప్రిల్ 16 నుంచి సదరమ్ శిబిరాలు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 30: నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సదరమ్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 16 న వినికిడి లోపం, 19న ఆర్థోపెడికల్, 24 న మానసిక దివ్యాంగులు, 30న దృష్టి లోపం ఉన్నవారికి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన దివ్యాంగులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడి ఓపీ స్లిప్, అవుటోపేషంట్ స్లిప్, దివ్యాంగుల కేటగిరీ నిర్ధారించుకుని మీ సేవలో రేపటి నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు ఆయా తేదీల్లో హాజరు కావాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెంబి, మార్చి 30: గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ చిక్యాల రత్నాకర్ రావు అన్నారు. శనివారం మండలంలోని రావికొత్తగూడెం గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటిని వృథా చేయవద్దని కోరారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

లక్ష్మణచాంద, మార్చి 30: వడ్యాల్‌లో ఉపాధిహామీ పనులను శనివారం డీఆర్‌డీవో విజయలక్ష్మి పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఉదయమే పనులకు వచ్చి ఎండ తీవ్రత పెరిగేలోపు ముగించుకోవాలని సూచించారు. కూలీల హాజరును పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో రాంప్రసాద్, ఏపీవో ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

చింతల్‌బోరి గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

భైంసాటౌన్, మార్చి 30 : నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. చింతల్‌బోరిలో శనివారం ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతివేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. సరైన పత్రాలులేని 92 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, కుంటాల ఎస్ఐ రజినీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే రచనలపై ఆసక్తి పెంచాలి

సోన్, మార్చి 30: విద్యార్థి దశ నుంచే రచనలపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు రాసిన కథల సంపుటిని శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. 20 కథలతో కూడిన ఈ కథల సంపుటి అత్యంత ఉపయుక్తమైనదని పేర్కొన్నారు. కథలు రాసేలా ప్రోత్సాహించిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి కొండూరి పోతన్న, హెచ్ఎం నాలం విద్యాసాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు లక్ష్మణ్, సాయిరెడ్డి, ముత్తన్న, అశోక్‌కుమార్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్

నిర్మల్ అర్బన్, మార్చి 30: నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్ శ్యామ్ రాథోడ్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు నాగేశ్వర్, సరితారాణి, అధ్యాపకులు డాక్టర్ పీజీ రెడ్డి, రవికుమార్, శంకర్, రమాకాంత్‌గౌడ్, నర్సయ్య, శ్రీహరి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి దూరంగా పన్నుల వసూళ్లు

- నిర్మల్‌లో 52, భైంసాలో 44, ఖానాపూర్‌లో 69.72 శాతం వసూలు
- నేటితో ముగియనున్న వడ్డీ మాఫీ

నిర్మల్ అర్బన్, మార్చి 30 : ఆస్తి పన్నుల వసూళ్లలో బల్దియాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 100 శాతం పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా మున్సిపల్ అధికారులు లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాల్టీలు ఉన్నాయి. ఆదివారం ఒక్క రోజు గడువు మాత్రమే ఉండగా..సెలవు దినం కావడంతో ఆన్‌లైన్‌లో పన్నులను చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు.

బల్దియా పన్నుల టార్గెట్..

నిర్మల్ మున్సిపాల్టీలో 42 వార్డులు, 23,809 గృహాలు ఉన్నాయి. వీటిలో కమర్షియల్, నాన్ కమర్షియల్, సెమీ కమర్షియల్ భవనాలున్నాయి. మొత్తం రూ.10.93 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మార్చి 30 వరకు 5.63 కోట్లు వసూలయ్యాయి. రూ.5.29 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 52.10 శాతం పన్నులను మాత్రమే వసూలు చేశారు. మొండి బకాయిదారులు 500 మందికి రెడ్ నోటీసులు జారీ చేశారు.

భైంసా మున్సిపాల్టీలో..

భైంసా మున్సిపాల్టీలో 26 వార్డులు, 12,146 గృహాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.6.02 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉండగా రూ.2.68 కోట్లు మాత్రమే వచ్చాయి. రూ.3.34 కోట్లు పన్నులువసూలు కావాల్సి ఉంది. 44 శాతం పన్నులు మాత్రమే వసూలు కావడం గమనార్హం.

ఖానాపూర్ మున్సిపాల్టీలో..

ఖానాపూర్ మున్సిపాల్టీలో 12 వార్డులు, 7,004 గృహాలు ఉన్నాయి. రూ.1.19 కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా రూ.83.56 లక్షల పన్నులు వసూలయ్యాయి. రూ.35.94 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 69.92 శాతం పన్నులు వసూలయ్యాయి.

రేపటితో వడ్డీ మాఫీ గడువు ముగింపు

మొండి బకాయిలను వసూలు చేసేందుకు మున్సిపల్ ఉన్నత అధికారులు వడ్డీ మాఫీకి వెసులుబాటు కల్పించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంతో పాటు పాత బకాయిదారులు పన్నులను చెల్లించక పోవడంతో మొండి బకాయిలు వసూలు చేసేందుకు పెండింగ్ పన్నులపై విధించిన వడ్డీని 90 శాతం మాఫీ చేస్తూ పురపాలక శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బకాయిదారులకు ఊరట లభించినా పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించేందుకు ఆసక్తి చూపలేరు. వడ్డీమాఫీ నేటితో ముగియనుంది.

ఖానాపూర్ లక్ష్యం రూ. 1.19 కోట్లు

ఖానాపూర్, మార్చి 30: ఖానాపూర్ మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నులు రూ. 1.19 కోట్లు వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ. 83.56 లక్షలు పన్నులు వసూలు చేశారు. మిగిలిన రూ. 35.94 లక్షలను నేటితో వసూలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనులతో పాటు పన్నుల వసూళ్లపై అధికారులు, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా పన్నులు వసూలు చేస్తున్నాం. 90 శాతం వడ్డీ మాఫీకి నేడు చివరి రోజు. ప్రజలు విధిగా వార్డుల్లో మున్సిపల్ అధికారులు లేదా పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చి ఇంటి, వ్యాపార పన్నులను చెల్లించాలి.

–మనోహర్, ఖానాపూర్ కమిషనర్

నేటి లోగా చెల్లించండి

ఆస్తి పన్ను వసూలుకు మార్చి 31 చివరి రోజు. ఆదివారం లోగా బిల్ కలెక్టర్, ఆన్‌లైన్ ద్వారా మున్సిపల్ ఆస్తి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. పాత బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ సదుపాయం ఉంది. మార్చి 31లోగా చెల్లించి వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి. బకాయిదారులు తప్పకుండా పన్నులు చెల్లించాలి.

– అనూప్ కుమార్, నిర్మల్ ఆర్ఐ

మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నల్లగొండ జడ్జిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసా, మార్చి, 30: నల్లగొండ జిల్లా జడ్జి విశాల్ కులకర్ణి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆకాంక్షించారు. భైంసా పట్టణానికి చెందిన దిలీప్ కులకర్ణి కుమారుడు విశాల్ కులకర్ణి నల్లగొండ జిల్లా జడ్జిగా నియమితులు కావడంతో శనివారం పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో భైంసా డాక్టర్స్ అసోసియేషన్, పుర ప్రముఖుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాల్ కులకర్ణి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటిసారిగా జిల్లా జడ్జిగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు. ఇది యువతకు మార్గదర్శకంగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఆయనను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భైంసా ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ కాశీనాథ్, డాక్టర్ దామోదర్ రెడ్డి, ఏజీపీ సంతోష్, బీజేపీ పటణాధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

భైంసా, మార్చి 30: కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్లమెంట్ ఎన్నికల ముధోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లోలం శ్యాంసుందర్ శనివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ముధోల్ నియోజకవర్గ కమిటీలో సభ్యుడిగా నియమించడంపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యమకారుల సమావేశం

కుభీర్, మార్చి 30 : ముధోల్ నియోజకవర్గ ఉద్యమకారుల చరిత్ర రచనలో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గౌరవాధ్యక్షుడు నగేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. రచన కమిటీ సభ్యులు కవి కడారి దశరథ్ మండలంలోని ఉద్యమకారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కుభీర్ మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పీరాజీ, సభ్యులు పానాజీ విజయ్‌కుమార్, శివలింగం, గోరేకర్ కాశీనాథ్, బాబు, సాయిశ్యాం, ఏశా దత్తాత్రి, సూది రాజన్న, గడ్డం మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నర్సాపూర్ (జీ), మార్చి 30: అర్లి ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లోకేశ్వరం మండలం బాగాపూర్‌కు చెందిన మాదరి భోజన్న రాంపూర్ నుంచి భాగాపూర్ వెళ్తుండగా అర్లి ఎక్స్ రోడ్డు వద్ద ముందర వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని తలకు బలమైన గాయాలయ్యాయి. భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు నర్సాపూర్ ఎస్ఐ హన్మాండ్లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

నిర్మల్ టౌన్, మార్చి 30: అధికారులు బాధ్యతగా పనిచేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం నిర్మల్ ట్రెజరరీ అధికారి ప్రభాకర్, కలెక్టరేట్‌లో పనిచేసిన ఇతర అధికారులు రిటైర్ కాగా సన్మానం చేసి మాట్లాడారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు విట్టాపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

కుంటాల, మార్చి 30: విట్టాపూర్‌లో రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ రుసుము రూ. 1200 కాగా మొదటి బహుమతి రూ. 25,000, ద్వితీయ బహుమతి రూ. 12,500 అందించనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7997563985, 9912858907 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా నిర్మించిన షెడ్డు కూల్చివేత

నిర్మల్ అర్బన్, మార్చి 30 : శాంతినగర్‌లో రైతు సహకార సంఘానికి చెందిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్డును శనివారం మున్సిపల్ కమిషనర్ ఎస్‌వీఎన్ రాజు, టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జేసీబీ సాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమణను కూల్చివేసినట్లు వారు తెలిపారు.

సమయపాలన పాటించాలి

ఖానాపూర్ టౌన్, మార్చి 30: ప్రతి అంగన్‌వాడీ టీచర్ సమయ పాలన పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత సూచించారు. శనివారం సీడీపీవో కార్యాలయంలో ఖానాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కేంద్రంలో 0–5 ఏళ్ల పిల్లల బరువు, ఎత్తులను రికార్డు చేయాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్

దస్తురాబాద్, మార్చి 30 : జిల్లా స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థి గొల్లపెల్లి హిమజ గోల్డ్ మెడల్ సాధించినట్లు ఎస్‌వో తిరుమల, పీఈటీ రాధ తెలిపారు. కరాటే కోచ్‌లు ఆరిఫ్‌ఖాన్, నారాయణ, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ టౌన్, మార్చి 30: జిల్లాలో ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించని కళాశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి డిమాండ్ చేశారు. శనివారం నిర్మల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మార్చి 30 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ప్రకటించిందన్నారు. కొన్ని కళాశాలలు వేసవిలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. అటువంటి కళశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సాయిచరణ్, శశాంక్, అజయ్, వంశీ ఉన్నారు

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

తానూర్, మార్చి, 30 : మహాలింగిలో శనివారం మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా గణపతి, క్యాషియర్‌గా దత్తు, చిక్లి హన్మాండ్లు, పోశెట్టి, సభ్యులుగా పోశెట్టి, ధర్మన్న, బాబన్న, చిన్నన్న, గణపతి, సాయినాథ్ ఎన్నికయ్యారు. అనంతరం బాసర మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రం స్థలం కొనుగోలుకు మున్నూరుకాపు సంఘం తరపున రూ. లక్షను ముధోల్ నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రోల్ల రమేశ్‌కు అందజేశారు.

అటవీ అధికారులకు వైద్య పరీక్షలు

కడెం, మార్చి 30: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని అటవీ అధికారులకు అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కడెం రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు కడెం ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. శనివారం రేంజ్ కార్యాలయంలో సిబ్బందికి రక్త పరీక్షలు, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. నిత్యం అటవీ ప్రాంతంలో అటవీ సంరక్షణకు కృషి చేస్తున్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ పరీక్షలకు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వోలు సిద్ధార్థ, ప్రకాశ్, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

దస్తురాబాద్,మార్చి 30 : ఉపాధిహామీ కూలీలు పని చేసే చోట జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. దేవునిగూడెంలో కొనసాగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలకు వచ్చి 11 గంటలకు పని చేసి వెళ్లాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, జీపీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలి

నిర్మల్ టౌన్, మార్చి 30: రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు కమీషన్‌ను పెంచాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఎస్ పంక్షన్‌హాలులో శనివారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీలర్లకు గౌరవ వేతనం, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పతికె రాజేందర్, ప్రధాన కార్యదర్శి షేక్‌మౌలానా, డీలర్లు రాజేందర్, దశరథ్, శ్రీను, రాజ్‌కుమార్, సాయిరెడ్డి, నరేశ్, సురేశ్, శంకర్ ఉన్నారు.

పంటమార్పిడిపై అవగాహన

నిర్మల్ టౌన్, మార్చి 30: రైతులకు పంట మార్పిడిపై అవగాహన పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ సూచించారు. శనివారం నిర్మల్ రైతు వేదికలో విత్తన డీలర్లు, రైతులతో